క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

హిందూపురం: మండల పరిధిలోని రాచపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన హిందూపురం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రాచపల్లి మహేంద్రనాథ్‌రెడ్డి కుమారుడి నామకరణం కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, బాబుల్లి, నరసారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిని సందర్శించిన ఈఈ

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయాన్ని జాతీయ రహదారుల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి ఆదివారం మధ్యాహ్నం సందర్శించారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఆలయ విశిష్టతను తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు.

భగవద్గీత పఠనంతో భక్తిభావం

పరిగి: హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీత పఠనంతో భక్తిభావం పెంపొందుతుందని త్రైత సిద్ధాంతం- ప్రభోద సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ముద్దిరెడ్డిపల్లి సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ తెలిపారు. ఆదివారం మండలంలోని కొడిగెనహళ్లిలో త్రైత సిద్ధాంత మత బోధనలపై ప్రజలను కలిసి హిందూ సనాతన ధర్మ ఆచరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శేఖర్, గోవర్ధన్, మునీంద్ర, సుబ్బమ్మ, జయమంగళగౌరీ, మోక్ష, లీల, సరస్వతి, మమత, పార్వతి, సింధూజ, చౌడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జ్యోతి

అమరాపురం: స్థానిక ప్రాథమిక మెయిన్ పాఠశాలలో ఆదివారం ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి రోగుల నుంచి స్పందన లభించింది. చిత్రదుర్గం నుంచి వచ్చిన స్త్రీల వ్యాధి నిపుణురాలు జ్యోతి 155 మంది రోగులను పరీక్షించి రూ.30 వేలు విలువ గల మందులను ఉచితంగా అందజేశారు. అలాగే పావగడ నుంచి వచ్చిన జనరల్ ఫిజీషియన్ ఓంకార్ 85 మంది రోగులను పరీక్షించి తగిన సలహాలు అందించారు. అలాగే హిందూపురం నుంచి వచ్చిన కంటి డాక్టర్ జింకా కృష్ణమోహన్ 100 రోగులను పరీక్షించి 40 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లను నిర్వహిస్తామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



గంగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైసీ గోవర్ధన్‌రెడ్డి

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు న్యాయవాది అశ్వత్థనారాయణ మాతృమూర్తి గంగమ్మ (73) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామానికి వెళ్లి గంగమ్మ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

18 నుంచి డిగ్రీ తరగతులు

హిందూపురం టౌన్: డిగ్రీ మూడవ సెమిస్టర్, ఐదో సెమిస్టర్ విద్యార్థులకు ఈ నెల 18 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని స్థానిక ఎస్‌వీసీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి పేర్కొన్నారు. అదేవిధంగా మొదటి సంవత్సరం డిగ్రీ బీఏ, బీఎస్సీ, బీ.కాం కోర్సులలో ప్రవేశాల కోసం విద్యార్థినులు కళాశాలలో సంప్రదించాలని సూచించారు. డిగ్రీ కోర్సులలో చేరాలనుకునే విద్యార్థినులు ఇంటర్ మార్కుల మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

వంట గదిలో ధరల మంట

- కొండెక్కిన కూరగాయల ధరలు
- బీన్స్ కిలో రూ.120
- టమాట రూ.70, మిర్చి రూ.80
- ఏదీ కొనేట్టులేదంటున్న జనం



మడకశిర మార్కెట్‌లోని కూరగాయల దుకాణం

మడకశిరరూరల్/గుడిబండ: మిర్చి రేట్ ఘాటెక్కిస్తోంది. టమాట ధర మంటలు పుట్టిస్తోంది. కూరగాయలు ఏవి కొనాలన్నా జేబులకు చిల్లులు తప్పడం లేదు. నిరుపేద కుటుంబాలు మాత్రమే కాదు, చిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలకు ఈ ధరలు పెనుభారంగా మారాయి.

అరకొర మార్కెట్‌తో సరి

కూరగాయలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కొనుగోలు దారులకు చుక్కలు చూపిస్తున్నాయి. అన్ని రకాల కూరగాయలు, దుంపలు, ఆకుకూరల ధరలు చూసి కొనుగోలు దారులు బెంబేలెత్తిపోతున్నారు. వారపు సంతకు వచ్చి ఎన్నో రకాల కూరగాయలు తీసుకు వెళదామనుకున్న వినియోగదారులు వాటి ధరలు చూసి ఆందోళనకు గురవుతున్నారు. దీంతో చేసేదేమి లేక కొన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఏం కొనేటట్టు లేదు... ఏం తినేటట్టు లేదంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ధరలు ఒక్కసారిగా రెండింతలు పెరగడంతో ఏం కొనలేక పోతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. వంటింట్లో ఏ కూర చేయాలన్నా టమాట , పచ్చి మిర్చి తప్పని సరిగా ఉండాల్సిందే. ఆ రెండింటి ధర మండిపోతోంది. కిలో టమాట రూ.70, మిర్చి రూ.80 చేరుకోవడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చేసేది లేక కొద్ది మొత్తంలోనే కూరగాయాలను మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు.

ధరల మంట ఇలా...

మార్కెట్‌లో కిలో పచ్చి మిరప ధర రూ.80, కిలో క్యారెట్ రూ.80, కిలో టమాటా రూ.70, కిలో వంకాయలు రూ.45, కిలో ముల్లంగి రూ.60, కిలో అలుగడ్డలు రూ.40, బీన్స్ కిలో రూ.120, కోస్ కిలో రూ.50, బెండకాయలు కిలో రూ.60, కట్ట కొత్తిమిర (చిన్నది) రూ. 20 చొప్పున ధరలు పలుకుతున్నాయి.

ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే..

మొన్నటి దాకా వేసవి పరిస్థితులు ఉండటం, దీనికి తోడు రైతులు కూరగాయల సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడంతోనే కూరగాయాల ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. కొనుగోలుకు పెట్టిన పెట్టుబడి గిట్టుబాటు అవుతుందని లాభం రాదని అంటున్నారు.

భారంగా మారాయి



మార్కెట్‌లో కూరగాయాల ధరలు మాలాంటి సామాన్యులకు భారంగా మారాయి. గతంలో రూ.150తో వారానికి సరిపడే అన్ని రకాల కూరగాయాలు కొనుగోలు చేసేవాళ్లం. ప్రస్తుతం పెరిగిన ధరలను చూసి కొద్ది కొద్దిగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఇప్పుడు వారానికి సరిపడా కూరగాయాలు కొనుగోలు చేయాలంటే రూ.500 ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

– వెంకటేష్ ,
ఆర్ అనంతపురం, మడకశిర మండలం

చాలా ఇబ్బందిగా ఉంది



కొండెక్కిన కూరగాయ ధరలతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ధరలు అధికంగా పెరగడంతో కూరగాయల కొనుగోలును తగ్గించాం. కిలో రూ.50 లోపు ఏ ఒక్క కూరగాయా లేదు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా కూరగాయాల ధరలు ఉండాలి.

– హేమంత్‌రాజు,
హరేసముద్రం మడకశిర మండలం

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

మడకశిరరూరల్: స్థానిక ఆర్అండ్‌బీ విశ్రాంత భవనంలో ఆదివారం ప్రెస్‌క్లబ్ కమిటీ సమావేశం జరిగింది. సీనియర్ పాత్రికేయుడు శంకర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ కమిటీ గౌరవాధ్యక్షులుగా వినోద్‌కుమార్, రామకృష్ణ, అధ్యక్షుడిగా హరీష్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, జనరల్ సెక్రటరీగా గోవిందప్ప, జాయింట్ సెక్రటరీగా పవన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఇర్ఫాన్, నాగరాజు, కోశాధికారిగా ఎస్ కృష్ణారెడ్డి, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

హిందూపురం: ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు భారీగా విరాళాలు అందజేశారు. సూగురు సడ్లపల్లిలో పురాణతమైన ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి జేసీ నరోత్తమరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు రూ.1.22 లక్షలు విరాళంగా అందజేశారు. అలాగే జేఎన్ ప్రభాకర్‌రెడ్డి, గిరిబాబు ఒక్కొక్కరు, రూ.10,116 అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో శివారెడ్డి, వెంకటేష్‌రెడ్డి, లింగారెడ్డి తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మందులతో మూర్ఛవ్యాధికి చెక్



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రామ్మూర్తి

హిందూపురం: మందులు క్రమం తప్పకుండ వాడితే మూర్ఛవ్యాధికి చెక్‌పెట్టొచ్చని జేవీవీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈటీ రామ్మూర్తి అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆల్‌హిలాల్ స్కూల్‌లో ఉచిత మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం జరిగింది. వైద్య శిబిరంలో 129 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు రామకృష్ణ, గంగిరెడ్డి, అతావుల్లా, ఉగ్రప్ప, నాగేంద్రచారి, బాలగంగధర్‌నాయక్, ప్రభాకర్, ఎం .రామకృష్ణా, సుబ్రమణ్యనాయక్, మంజునాథ్ ,విశ్వనాథచారి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్ 'దోషులను కఠినంగా శిక్షించాలి



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తంచేస్తున్న ఏఐడీఎస్‌ఓ నాయకులు

హిందూపురం: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలంటూ ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏఐడీఎస్ఓ నాయకురాలు భవ్య అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ రాష్ట్ర నాయకుడు మల్లిక్ దత్‌కుమార్ మాట్లాడుతూ నీట్ ఫలితాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారన్నారు. ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసిన విద్యార్థులందరికీ ఒకటే స్కోరు రావడం విచిత్రంగా ఉందన్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహణకు ముందే ప్రశ్నపత్రాలు లీక్ చేసి ఒక్కొక్కరి వద్ద రూ.30 నుంచి రూ.35 లక్షల వరకూ నగదు తీసుకున్నారని దోషులు ఒప్పుకున్నట్లు చెప్పారు. ఇప్పటికే కొందరు విద్యార్థులు ఫలితాలు సరిగా రానందున ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. నీట్ ప్రక్రియపై న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఏఐడీఎస్ఓ డిమాండ్ చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ హిందూపురం నాయకులు పూజిత, రితీష ,భవ్య, జోష్న, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



జిల్లా స్థాయిలో 2వ ర్యాంకు సాధించిన నేహాకు ప్రతిభా పురస్కారం అందిస్తున్న దృశ్యం

పావగడ: ప్రైవేటు స్కూళ్లలో చదువుతూ పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్థానిక ఆంగ్ల మాధ్యమ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ప్రతిభా పురస్కారాలు అందజేసింది. పట్టణంలోని వేంకటేశ్వర ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మెదుమా అధ్యక్షుడు మునిస్వామి మాట్లాడారు. అనంతరం 54 మంది పదో తరగతి విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ప్రసన్నమూర్తి, ఉపాధ్యక్షుడు ఎస్‌జీ శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు వెంకటరామయ్య, కార్యదర్శి అంజనశెట్టి,జిల్లా డైరెక్టర్లు మధు, అజయ్, నాగేశ్, చంద్రశేఖర్, పరంధామరెడ్డి, సహనా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకి విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న వాల్మీకి నాయకులు

హిందూపురం టౌన్: విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని వక్తలు తెలిపారు. ఆదివారం పట్టణంలోని వాల్మీకి కళ్యాణ మండలంలో వాల్మీకి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్‌లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ వాల్మీకి విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యార్థుల అభివృద్ధికి తమవంతు కృషి ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, బంగారు కృష్ణమూర్తి, పీసీ గంగన్న, జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి శివయ్య, గౌరవాధ్యక్షుడు పుట్టకమప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివన్న, ట్రెజరర్ రామకృష్ణ, ఎన్‌జీఓ సంఘం తాలూకా అధ్యక్షుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పరిగి: మండల కేంద్రమైన పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం ఆ పాఠశాలలోనే నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. వారితో పాటూ అప్పట్లో పాఠాలు నేర్పిన గురువులను ఈకార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణమంతా వారు కలియ తిరిగి, తాము పాఠాలు నేర్చుకున్న తరగతి గదులను సందర్శించారు. అనంతరం అప్పట్లో నెలకొన్న అనుభవాలను ఒకరికొకరు నెమరేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తామంతా సహకరిస్తామని ప్రధానోపాధ్యాయుడు సత్యకృపారాజ్‌కు తెలిపారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయుడు ప్రభాకర్, విద్యార్థులు నాగరాజు, స్థానిక సర్పంచ్ శివశంకర్, నవీన్‌కుమార్, శ్రీధర్, నాగానంద, ఆంజనేయులు, ఉగ్ర నరసింహా, చంద్ర, రాజేష్, మల్లి, సోము, రామకృష్ణ, సత్య, నాగేంద్ర, ప్రభాకర్, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ వేంకటేశ్వరుడి కల్యాణం



ఆలయ ఆవరణలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

హిందూపురం: పట్టణంలోని లక్ష్మీపురంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై కొలువుదీర్చి వేదపండితుల మంత్రాలతో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం నగరోత్సవం చేశారు. తర్వాత భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

రైల్వేలైన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలి

రొళ్ల: కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి వయా రాయదుర్గం మీదుగా తుమకూరు వరకూ మంజూరైన రైల్వే నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కిసాన్‌మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి సీఎం ఘట్ట ముద్దరాజు తెలిపారు. ఈమేరకు తుమకూరులో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర రైల్వేసహాయ మంత్రికి వినతిపత్రం అందజేశామన్నారు.

బక్రీద్ పండుగకు ఏర్పాట్లు

హిందూపురం: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను ఘనంగా నిర్వహించడానికి మసీదు కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి. స్థానిక ఆల్‌హిలాల్ ఈద్గా వద్ద జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో వేలాది మంది ముస్లింలు ఉదయం 8 గంటలకు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొననున్నారు. అలాగే మేళాపురం, మోడల్‌కాలనీ, నింకంపల్లి తదితర ప్రాంతాల్లోని ఈద్గాల వద్ద కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో కూడా ఈద్గాలను శుభ్రం చేసి మౌలిక వసతులు కల్పించారు. పట్టణంలోని మసీదులు, ఈద్గాల వద్ద డీఎస్పీ కంజాక్షన్ పర్యవేక్షణలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కారు - ద్విచక్ర వాహనం ఢీ

- వ్యక్తికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న లింగేగౌడ్

అగళి: మండల పరిధిలోని రామనపల్లి గ్రామ సమీపంలో ఆదివారం కారు –ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో దొక్కలపల్లి గ్రామానికి చెందిన లింగేగౌడ్ తలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు... ఇరిగేపల్లి గొళ్లహట్టి రెడ్డప్ప తన కారులో అగళి నుంచి రొళ్ల వైపు వెళుతున్నారు. అలాగే రొళ్ల నుంచి అగళి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనంలో లింగేగౌడ్ వెళ్తున్నారు. కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో లింగేగౌడ్‌కు బలమైన రక్తగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన రొళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

పేదలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే వెంకటేష్



ఎమ్మెల్యే వెంకటేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఉన్న పేద ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటామని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ భరోసా ఇచ్చారు. స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో స్థానిక బ్లాక్ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే వెంకటేష్ 48వ పుట్టిన రోజు వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా పది, పీయూసీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కరాలు అందించారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు మొబైల్ ఫోన్లు అందించారు. అలాగే 39 మంది యువకులు రక్తదానం చేశారు. అంతకు ముందు గంగసాగర గ్రామంలో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అలాగే పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆదిజాంభవ, అంబేడ్కర్ అభివృద్ధి మండలి నుంచి మంజూరైన మోటారు పంపులు, పరికరాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుదేశ్‌బాబు, రామాంజినప్ప, శంకరరెడ్డి, రాజేశ్, రవి, గుమ్మఘట్ట శ్రీనివాసులు, నాని, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తాతయ్య జీవసమాధి మహోత్సవం

హిందూపురం: సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో క్షేత్రం కైవారం తాతయ్య 189 జీవ సమాధి మహోత్సవాన్ని ఆదివారం స్థానిక కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. జీవసమాధి మహోత్సవం సందర్భంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకూ అఖండ రామ భజన కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 700 మంది భక్తులు కీర్తనలు పాడుతూ నగర సంకీర్తన చేశారు. అనంతర అభిషేక పూజలు నిర్వహించారు. పూజల తర్వాత పెద్ద ఎత్తున అన్నదాన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కైవారం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు బాగేపల్లి నరసింహయ్య కృష్ణయ్య, కుప్పం వెంకటాచలపతి, అరుణ్, హిందూపురం భక్తబృందం అశ్వతనారాయణస్వామి, కోన పీఠాధిపతి చంద్రస్వామి, రాజప్ప, అయ్యప్ప, చౌడమ్మ గంగాధరప్ప, నాగరాజు, రవిశంకర్, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర భక్తులు పాల్గొన్నారు.

వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి 'మురళీధర్'



అధ్యాపకుడు మురళీధర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

లేపాక్షి: మండలంలోని మహాత్మాజ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన ఇంగ్లిష్ అధ్యాపకుడు మురళీధర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుందరరాజు మాట్లాడుతూ ఎస్సీ, బీసీ గురుకులాల్లో ఉపాధ్యాయుడిగా, అధ్యాపకునిగా, ప్రధానాచార్యుడిగా వృత్తికే వన్నె తెచ్చి విద్యార్థుల మనసు గెలిచిన వ్యక్తి మురళీధర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ గురుకుల పాఠశాలల పూర్వ కార్యదర్శి ఎం.నాగభూషణ, గురుకుల పాఠశాలల పూర్వ సంయుక్త కార్యదర్శి విశ్వనాథరావుతో పాటు పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసం పంపిణీ



పశుగ్రాసాన్ని అందిస్తున్న మహదేవయ్య, స్వామి జపానంద

పావగడ: తాలూకాలోని వద్రేవు గ్రామంలో ఆచారం ప్రకారం దేవునికి వదిలేసిన సుమారు 160 దేవుడి ఆవులతో పాటు రైతుల ఆవులు మేత కోసం పశుగ్రాసాన్ని అందజేశారు. స్వామి జపానంద వినతి మేరకు తుమకూరుకు చెందిన పారిశ్రామిక వేత్త ప్రాణి దయా ప్రచార సంఘం అధ్యక్షుడు సీవీ మహదేవయ్య రూ.50 వేలు విలువైన పశు గ్రాసాన్ని ఆదివారం అందజేశారు.